# మాతృవందనం

ఎ.రాజరాజేశ్వరి

ఆ రోజు ఉపాధ్యాయ దినోత్సవం. శ్రీలక్ష్మి మనసు చాలా సంతోషంగా ఉంది. ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకోబోతోంది. అంతేకాదు, ఆ రోజు ఆమె పుట్టినరోజు కూడా.

చీర కుచ్చిళ్లు సరి చేసుకుంటున్న ఆమె ఏదో గుర్తుకొచ్చినట్లుగా తల్లిని పిలిచింది.

"అమ్మా! రెడీయేనా? ఆటో తెస్తాను."

ఆమె తల్లి సుమతికి సుమారు అరవై ఏళ్లు వుంటాయి. మూర్తీభవించిన మంచితనంలా వుంటుంది. కూతురి మాటలు విన్న ఆమె "నేనెందుకమ్మా ఆ ఫంక్షన్‌కు. నువ్వు వెళ్లొస్తే సరిపోతుందికదా"

తల్లి మాటలకు శ్రీలక్ష్మి చిరుకోపంగా చూసింది.

"ముందే చెప్పాను ఈ రోజు నేను ఏమడిగినా కాదనకూడదని"

ఇంక ఏం చెప్పినా కూతురు వినదని "ఉండు అయితే ఒక్క అయిదు నిముషాల్లో చీర మార్చుకుని వస్తాను" అంటూ లోపలకు వెళ్లింది.

తల్లి తయారై వచ్చేవరకూ శ్రీలక్ష్మి పుస్తకం తిరగేస్తూ కూర్చుంది.

ముదురాకు పచ్చరంగు చీర, తెలుపు జాకెట్టు, నుదుట ఆంజనేయుని సింధూరం, తెల్లగా నెరిసిన జుట్టును కుదురుగా ముడి వేసుకుని చాలా హుందాగా ఉంది.

రెప్ప వాల్చకుండా తననే చూస్తున్న కూతురిని చిరునవ్వు నవ్వుతూ తట్టింది.

"టైమవుతోందని నన్నే చూస్తూ కూర్చున్నావు. ఫంక్షన్ నుండి వచ్చాక మళ్లీ చూద్దువుగానీ పద వెళదాం"

శ్రీలక్ష్మి తేరుకుని అటుగా వెళ్తున్న ఆటోను కేకేసింది.

స్కూలుకు చేరుకున్న వారికి టీచర్లు ఎదురేగి ఆహ్వానించారు.

టీచర్లు, విద్యార్థులు శ్రీలక్ష్మిని అభినందనలతో ముంచెత్తుతున్నారు. పొగడ్తలతో ముంచెత్తుతున్న కూతురిని చూడడానికి రెండు కళ్లు చాలడంలేదు.

'ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో! తననీ ముసలి వయసులో అన్నీ తనే అయి సేద తీరుస్తోంది. కేవలం తన కోసమే పెళ్లి కూడా మానుకుని తన జీవితాన్ని తల్లి కోసం త్యాగం చేసిన తన కూతురు అరుదైన మణిపూస'. సుమతి ఆలోచనలు ఎంత వద్దనుకున్నా గతంలోకి జారుకున్నాయి.

***

సుమతికి ఇద్దరు కొడుకులు. కవలలు. సురేష్, మహేష్‌లు.

పద్దెనిమిది సంవత్సరాలకే పెళ్లి కావడం, వెనువెంటనే కవలపిల్లలవడంతో వారిని పెంచడంలో చాలా అవస్థలు పడింది. ఇద్దరికిద్దరు చాలా అల్లరి పిల్లలు. వారు పుట్టిన ఆరు సంవత్సరాలకు శ్రీలక్ష్మి పుట్టింది.

అన్ని సంవత్సరాల తరువాత ఆడపిల్ల పుట్టేసరికి వారి ఆనందానికి అవధులు లేకపోయింది. శ్రీలక్ష్మికి ప్రతిరూపం అని శ్రీలక్ష్మి పేరు పెట్టుకున్నారు.

కవలలకు తమ చెల్లిని ముద్దు చేయడం, తమ అల్లరికి తల్లి ఇదివరకులా శాంతం వహించకపోవడం, అప్పుడప్పుడు తమ పేచీలు శృతి మించితే తల్లి కోపంతో దండించడం... ఇవన్నీ వారి పసి మనసుల్లో చెల్లెలంటే ఒక విధమైన అసూయ ఏర్పడేలా చేసాయి.

ఎవరూ లేనప్పుడు శ్రీలక్ష్మిని గిల్లి ఆమె గుక్కపట్టి ఏడుస్తుంటే ఆనందించేవారు.

ఒకసారి చెల్లెలిని గిల్లుతూ తల్లికి దొరికిపోయారు.

ఆమెకు చాలా కోపమొచ్చి, ఇంకెప్పుడూ తప్పు చేయమని లెంపలేసుకునేవరకూ కొట్టింది.

"పోనీలే. చిన్న పిల్లలు. తెలీక చేసారు. ఈసారికి వదిలేయ్" అని ఆమె భర్త రంగారావు వారించారు.

ఇద్దరూ ఒకేసారి పుట్టినందుకు వారికి ఇంచుమించు ఒకేరకం గుణాలు, అలవాట్లు ఉన్నాయి. ఇద్దరూ చదువులో ఒకరిని మించి ఒకరు పోటీ పడేవారు.

వారికొచ్చే మార్కులు చూసి సుమతి, రంగారావులు ఎంత కష్టమైనా సరే వారు కోరుకున్న చదువు చెప్పించి ప్రయోజకులను చేయాలని ఆశించేవారు.

టెన్త్ డిస్టింక్షన్‌లో పాసై ఒకరు ఎమ్‌పిసి, ఇంకొకరు బైపిసి తీసుకోవడంతో సుమతికి దిగులనిపించింది.

"ఇద్దరూ తెలివైనవాళ్లు. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో సీటు సంపాదించుకుంటారు. ఒకేసారి ఇద్దరి ఖర్చులు భరిస్తూ చదివించడం కష్టం కదండీ" అంది బేలగా.

"తప్పదు సుమతీ! ఎంత కష్టమైనా సరే మన కొడుకులు ఇంజనీర్, డాక్టర్ అయితే ఆ గొప్ప మనదికాదా! కాబట్టి వారి చదువు బరువనుకోకు. బాధ్యత అనుకో"

భర్త మాటల్లోని నిజాన్ని గ్రహించి ఎంత కష్టమైనాసరే కొడుకులను ఉన్నత స్థానంలో ఉంచాలనుకుంది.

తానొకటి తలిస్తే దైవమొకటి చేస్తాడన్నట్లు రంగారావుకు హార్ట్ ఎటాక్‌వచ్చి ఈ లోకాన్ని వదిలిపోయాడు. సుమతికి నెత్తిన పిడుగుపడ్డట్లయింది.

భర్త పోయాక వచ్చిన డబ్బులన్నీ కొడుకుల చదువులకు అయిపోయాయి. పోనీలే, చదువులు పూర్తయి ఇద్దరికీ ఉద్యోగాలు వస్తే తననీ, కూతురినీ వాళ్లే చూసుకుంటారనుకుని మనసు దిటవు చేసుకుంది.

అనుకున్నట్లుగానే కొడుకులు మంచి మార్కులతో పాసవడంతో తమ కష్టలు గట్టెక్కాయని సంబరపడిపోయింది.



కానీ అప్పుడే అసలు కథ మొదలయింది.

ఎప్పుడు అప్లై చేసారో కానీ వారికి పై చదువులకోసం లైను క్లియర యింది. ఒకరికి అమెరికా, కెనడా యూనివర్శిటీల్లో మెరిట్ సీటు దొరికింది. స్పాన్సర్సు దొరికారు.

స్కాలర్‌షిప్ ఎలాగూ దొరుకుతుంది. కాకపోతే తమ బట్టలకు, పై ఖర్చు లకు డబ్బు చాలా అవసరం.

కొడుకులు చెప్పిన మాట విని సుమతి నిర్ఘాంతపోయింది. ఇక్కడే ఉండి ఉద్యోగాలు చూసుకుంటారనుకుంటే, 'మాకు రెక్కలొచ్చాయి, రెక్కల విమానంలో దూరతీరాలకు ఎగిరిపోతాం' అంటుంటే ఏమనాలో అర్థం కాలేదు.

భర్త మాటలు గుర్తొచ్చి మౌనం వహించింది. అసలు విషయం అప్పుడు చెప్పారు.

## స్త్రీలకు జరుగుతున్న అన్యాయం

ప్రపంచ జనాభాలో స్త్రీలు సగమున్నా మూడింట రెండువంతుల పనిని వాళ్లే చేస్తున్నారు. కానీ ప్రపంచ ఆదాయంలో వాళ్లకి 10 శాతం కూడా దక్కడంలేదు. ఆస్తుల్లో ఒక శాతంకన్నా తక్కువే ముడుతోంది. ప్రపంచంలోని కడు బీదవాళ్లకన్నా ఎక్కువ పేదవాళ్లు ఆడవాళ్లేనని బార్బర్ కోనబుల్ అనే శాస్త్రవేత్త అంటున్నారు.


## రికార్డుకెక్కిన మదర్స్ ఫోటో

మే 11న మదర్స్ డే రోజున ప్రదర్శించడానికి ప్రపంచంలోని అతి పెద్ద ఫోటోని ఒక చైనా కంపెనీ చోంగ్కింగ్ సిటీలో ప్రింట్ చేయించింది. చిరునవ్వులు చిందిస్తున్న పరిపూర్ణమైన ఒక తల్లి ఫోటోని 9000 చదరపు మీటర్ల వైశాల్యంతో ఒక ఫుట్‌బాల్ ఫీల్డులో పట్టేటంత సైజులో ప్రింటింగ్ చేయించారుట. దానికైన ఖర్చు 70 వేల పౌండ్లు.

## సాలెగూడు దారాలతో బట్టలు

మెడగాస్కర్‌లో సాలెగూడు నుంచి తీసిన దారాలతో బట్టలను నేస్తారుట.

-తటవర్తి




"మా ఇద్దరికీ చెరో లక్ష రూపాయలు కావాలని"

డబ్బు ఎలా సమకూర్చారో అర్థం కాలేదు. చివరికి తన పేరుతో వున్న పొలం బేరం పెట్టేసింది.

కొడుకులు కోరినట్లుగా ఇద్దరికీ చెరో లక్ష ఇచ్చేసి యాభైవేలు కూతురి పేరున ఆమె చదువుకోసం ఫిక్సడ్‌లో వేసింది. మిగిలిన యాభైవేలు ఖర్చు లకు ఉంటుందని బ్యాంకులో వేసింది.

తీరా వెళ్లేముందు ఇంకొంచెం డబ్బు కావాలని చెరో పదివేలు పట్టుకు పోయారు.

తాము వెళ్లిపోతే తల్లి, చెల్లెలు ఎలా బ్రతుకుతారు? వాళ్ళ పోషణ మాటే మిటి?

చెల్లెలు చదువు సంగతేమిటి? ఈ ప్రశ్నలకు వారి దగ్గర జవాబులేదు. ఉన్నా వారి కళ్లముందు తాము వెళ్లి గడపబోయే ఫారిన్ జీవితం వారిని మూగవారిని చేసింది.

తను కూతుర్ని ఎన్ని తిప్పలు పడి పెంచి చదివించగలిగినా కనీసం ఆమె పెళ్లి సమయానికైనా తనకి అండగా ఉంటారని ఆశించింది. మనసును దిటవు చేసుకుని వారిని ఖండాంతరాలకు సాగనంపింది.

ఫారిన్ చేరిన కొడుకులు అక్కడ గ్రీన్‌కార్డు సంపాదించి పర్మినెంట్ సిటి జన్లుగా సెటిలవ్వాలని అక్కడే పుట్టి పెరిగిన గుజరాతీ అమ్మాయిని, కేరళకు చెందిన మలయాళీ అమ్మాయిని పెళ్లిచేసుకుని అక్కడే స్థిరపడిపోయారు.

అక్కడికి వెళ్లిన కొత్తల్లో అక్కడ వారు స్టూడెంట్‌గా పడుతున్న కష్టాలు ఏకరువు పెడుతూ ఎప్పుడయినా ఉత్తరాలు వ్రాసేవారు. ఆ తరువాత తాము పెళ్లి చేసుకున్నట్లు తెలియజేస్తూ వంద డాలర్లు పంపించారు. తరు వాత ఆ ఉత్తరాలు కూడా ఆగిపోయాయి.

ఆమె ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబు లేకపోవడంతో వారెక్కడున్నా క్షేమంగా, సుఖంగా ఉండాలని భగవంతుడ్ని ప్రార్థించింది.

తన భర్త సంపాదించిన డబ్బంతా కొడుకుల చదువులకే ఖర్చయిపో యింది.

కూతురి చదువుకోసం ఏదో కొంత డబ్బు దాయగలిగినా ఇంటి ఖర్చు లకు కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎవరినీ చేయి చాచి అడగలేని ఆత్మాభిమానం. వేరే మార్గం లేక సూప ర్‌బజార్‌లో హెల్పర్‌గా చేరింది.

ఆ షాపు ఓనరు సహృదయుడు కాబట్టి ఏ కష్టం లేకుండా జీవితాన్ని నెట్టుకురాగలిగింది.

శ్రీలక్ష్మి కూడా తల్లి కష్టాన్ని అర్థం చేసుకుని ప్రతి క్లాసులోనూ మంచి మార్కులు సాధిస్తూ ఇంటర్ పాసయింది.

ఇంజనీరింగ్‌లో చేరమని ప్రోత్సహిస్తున్న తల్లి కోరికను మృదువుగా తిర స్కరించింది.

"ప్రతివారు ఇంజనీర్లు, డాక్టర్లు అయిపోతే వారిని తీర్చిదిద్దే గురువులు ఎలా వస్తారమ్మా. నేను మంచి టీచర్‌ని అయి దేశానికి ఉపయోగపడే మంచి విద్యార్థులను కొందరినైనా తయారు చేస్తాను. కాబట్టి డిగ్రీ చదివి ఆ తరువాత బిఇడి చేస్తాను" అంది.

సుమతి ఇక తర్కించలేదు. కూతురు తీసుకున్న నిర్ణయానికి చాలా ఆనందించింది.

'నిజమే విద్యార్థులు మంచి టీచర్ చేతిలో పడితే వారు చదువులోనే కాదు, క్రమశిక్షణ, సత్‌ప్రవర్తన నేర్చుకుని జన్మించిన భూమిని, జన్మనిచ్చిన తల్లిని వదిలి పెట్టక వారి రుణం తీర్చుకుంటారు.'

★★★

"ఏమండీ! మిమ్మల్ని టీచర్‌గారు రమ్మంటున్నారు" ఆమె ఆ పిలుపుకి వాస్తవంలోకి వచ్చి వారిని అనుసరించింది.

శ్రీలక్ష్మి తల్లిని స్టేజీమీదకు తోడ్కొని వచ్చింది.

తనకు కేటాయించిన కుర్చీలో కూర్చోబెట్టింది.

శ్రీలక్ష్మి మైక్‌నందుకుని ఒకసారి సభను కలియజూసింది. తనకింత విలువ, గుర్తింపు ఇస్తున్న స్కూలు యాజమాన్యానికి, తనతోటి టీచర్లకు కృతజ్ఞతలు తెలియజేసింది.

తన విద్యాబోధనకు మంచి పొజిషన్‌లోకి వచ్చిన పూర్వ విద్యార్థులు, తమ సన్మానసభకి హాజరయినందుకు ఎంతో సంతోషించింది. వారికి తన ఆశీస్సులు అందజేసింది.

ఇంతలో కొంతమంది స్టూడెంట్స్ పెద్ద కేకును తెచ్చి టేబుల్‌మీద పెట్టి "మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు మేడమ్, మా సంతోషం కోసం మీరు కేక్ కట్ చేయాలి" అన్నారు.

బొకే అందించి దండ వేయబోతున్న వారిని వారించి ఆ దండని తన తల్లి మెడలో వేసింది.

"నా పుట్టినరోజును గుర్తు పెట్టుకుని బహిరంగ వేడుక చేస్తున్నందుకు మీ అందరికీ ధన్యవాదములు. మీ అందరి అనుమతితో కొన్ని మాటలు చెప్పాలనుకుంటున్నాను. నేను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు గెల్చుకున్నానని సంతోషంతో పొంగిపోయాను. దానికి కారణం నాలో జ్ఞాన జ్యోతిని వెలిగించిన చదువుల తల్లి సరస్వతి. అందరికీ విద్యాదానం చేసే శక్తిని వరంగా ప్రసాదించింది. ఆవిడ కనబడని దేవత అయినా ఉనికి ఉందన్న నమ్మకంతో చదువుల తల్లి అయిన సరస్వతీదేవికి నా నమస్సులు అందజేస్తున్నాను.

ఇక అనుక్షణం నా కంటికి కనిపించి కనులు తెరవని పసిగుడ్డుగా ఉన్న నన్ను ఎన్నో కష్టాలకోర్చి నా ఉన్నతికి అనుక్షణం తపించి తన శ్రమశక్తిని వెచ్చించి కొవ్వొత్తిగా మారిన నా మాతృమూర్తికి నా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. నిజానికి ఈ వేడుక నా పుట్టినరోజుగా కాక నన్ను పుట్టించిన రోజుగా మా అమ్మ చేతుల మీదుగా ఈ కేకు కట్ చేయిస్తే సంతోషిస్తాను."

ఆమె మాటలకు సభలోని వారందరూ చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

"ఈ స్పందనే మీ అనుమతిగా భావించిన నేను నా జన్మకు కారణమైన మా అమ్మకు మాతృవందనం చేస్తూ కేక్ కట్ చేయమని ఆహ్వానిస్తున్నాను."

కూతురు తనకిస్తున్న గౌరవానికి సుమతి కళ్లు చెరువులయ్యాయి. కేక్ కట్ చేసి కూతురికి తినిపించింది.

"మీ అందరి అనుమతితో కొన్ని మాటలు మాట్లాడతాను. పున్నామ నరకం నుండీ తప్పించేది కొడుకులు. వారి నీడలో తమ జీవితం వెళ్లిపోతే చాలనుకుంటారు చాలామంది. ఆడపిల్లకు ఎంత చేసినా దండగ, పెళ్లి చేసుకుని వేరే ఇంటికి పోయేదేకదా అనుకుంటారు. ఈ మాట చదువు సంధ్యలు లేక చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేసిన పాత తరాలలో నిజం కావచ్చు. వారు తమ తల్లిదండ్రులకు ఏమీ చేయలేకపోవచ్చు. కారణం ఆ నాటి పరిస్థితులు. కానీ ఈ రోజుల్లో మగ పిల్లలతో సమానంగా అన్నింటిలోనూ రాణిస్తున్న ఆడపిల్ల స్వార్థం విషయంలో మాత్రం బాగా వెనకబడి ఉంటోంది.

రెక్కలొచ్చిన కొడుకులు తమ స్వార్థం చూసుకుంటే పెళ్లి చేసుకోమని పోరినా నా జీవితం వార్ధక్యంలో ఒంటరిగా మారి శేష ప్రశ్న కాకూడదని తన తల్లి కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన త్యాగశీలి నా కూతురు. ఇటువంటి కూతురిని నాకిచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అలాంటి కూతుర్ని కన్న నేను ధన్యజీవిని" అంది శ్రీలక్ష్మి తల్లి కన్నీళ్లతో.

సభంతా ఆమె ప్రసంగం విని చప్పట్లతో ప్రశంసించారు.

శ్రీలక్ష్మి కోరికను మన్నించి అవార్డును సుమతి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ ఆమెకు అందించింది.

శాలువా కప్పి సన్మానం చేస్తున్న తల్లి కాళ్లకి నమస్కరించింది.

'కంటే కూతుర్నే కనాలి' తనకి మాతృవందనం చేస్తున్న శ్రీలక్ష్మిని లేవనెత్తి నుదుట చుంబించింది.

ఆ తల్లి పరిష్వంగనంలో ఆమె మళ్లీ పసిపాపే అయింది.

★



## ఐటమ్ గాళ్ కశ్మీరాషా

బాలీవుడ్‌లో ఐటమ్ గాళ్‌గా తనదైన గుర్తింపు తెచ్చుకుంది కశ్మీరా షా. కానీ రాఖీ సావంత్ ఆగమనం ఆమెకి పోటీలా తయారైంది. అదలా వుంటే తాజాగా కశ్మీరా రెండు హాలీవుడ్ సినిమాల్లో నటించే చాన్స్ కొట్టేసింది. దీంతో ఆమె గర్వంగా చూస్తోందిప్పుడు. మరిన్ని హాలీవుడ్ ఆఫర్లని కూడా సొంతం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను అంటోంది కశ్మీరా. మల్లికా షెరావత్‌లా మరీ చిన్న చిన్న వేషాలు కావు నావి ఈ సినిమాల్లో గర్వంగా చెబుతోంది.

